క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

తుంగతుర్తి : తుంగతుర్తిలోని తెలంగాణ గిరిజన సంక్షేమ బాలికల పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు బోధించేందుకు అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ శోభారాణి తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. పాఠశాల, కళాశాలలో ఎకనామిక్స్-1, పీజీటీ ఇంగ్లిష్-1, టీజీటీ మ్యాథ్స్-1 ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. అర్హులైన మహిళా అభ్యర్థులు ఈనెల 29లోపు పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పశువులకు టీకాలు



టీకాలు వేస్తున్న వైద్యసిబ్బంది

అర్వపల్లి : పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ బి. అర్జున్ కోరారు. మండల పరిధిలోని చాకలిగూడెం గ్రామంలో ఆదివారం పశువులకు టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోరపాక సత్యం, వీఎల్‌ఓ కేఎస్ఎస్. పద్మ, గోపాలమిత్ర ఆల్దాస్ లింగయ్య, యాకయ్య పాల్గొన్నారు.

జిల్లా కోకన్వీనర్‌గా సత్యం



అర్వపల్లి : వ్యవసాయ విస్తరణ అధికారుల జేఏసీ జిల్లా కో కన్వీనర్‌గా మండల పరిధిలోని తిమ్మాపురం క్లస్టర్ ఏఈఓ నేరెళ్ల సత్యం ఎన్నికయ్యారు. కాగా ఆదివారం అర్వపల్లిలో ఆయన మాట్లాడారు. తన ఎన్నికకు సహకరించిన జిల్లా చైర్మన్ బుషిగంపల జానయ్య, కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ



మారెమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీసీసీ ఉపాధ్యక్షుడు యోగానందచారి

అర్వపల్లి : మండల పరిధిలోని కాసర్లపహాడ్ గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు జిల్లా శ్రీరాములు తల్లి మారెమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందింది. దీంతో మృతురాలి కుటుంబీకులను ఆదివారం కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి పరామర్శించారు. రూ.10వేలు ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోరపాక సత్యం, సేవాదళ్ మండల అధ్యక్షుడు బొౌర గిరిబాబు, అమీనుద్దీన్, బొల్లం లింగరాజు, నల్లగుంట్ల రవికుమార్, యుగంధర్, మొఘల్‌సాబ్, రమేష్, నరేష్, యల్లయ్య తదితరులు పాల్గొన్నారు.


సిరిపురంలో డీజే నిషేధానికి తీర్మానం



సమావేశంలో పాల్గొన్న ఎస్‌ఐ అజయ్‌కుమార్, గ్రామపెద్దలు

నడిగూడెం : మండలంలోని సిరిపురం గ్రామంలో ఆదివారం గ్రామస్తులు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామంలో ఇక నుంచి డీజే నిషేధించాలని తీర్మానించారు. ఇటీవల గ్రామానికి చెందిన గేసగాని సతీష్(26) గ్రామంలో ఓ పెళ్లి వేడుకలో డీజేతో ఊరేగింపులో పాల్గొని ఇంటికెళ్లి గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో గ్రామపెద్దలు గ్రామంలో డీజే ఉపయోగించొద్దని తీర్మానం చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ జి.అజయ్‌కుమార్, గ్రామపెద్దలు వెంపటి రామారావు, కాసాని వెంకటేశ్వర్లు, మొక్క భిక్షపతి, కస్తూరి లక్ష్మయ్య, వాసికర్ల శేషుకుమార్, మొక్క రామయ్య, కాంపాటి శివాజీ పాల్గొన్నారు.


ఒకే కుటుంబంలో ఇద్దరికి ఎంబీబీఎస్ సీట్లు



తల్లిదండ్రులతో ఉషశ్విని, తేజశ్విని

కోదాడరూరల్ : మండల పరిధిలోని కాపుగల్లు గ్రామంలో ఒకే ఇంట్లో ఇద్దరు అక్కాచెల్లిలు ఓపెన్ కేటగిరిలో ఎంబీబీఎస్ సీట్లు సాధించారు. గ్రామానికి చెందిన చలసాని జగన్-శ్రీలత దంపతుల పెద్ద కుమార్తె ఉషశ్విని 2022లో నీట్ పరీక్షలో ప్రతిభ చూపి జీఎంసీ మహబూబాబాద్‌లో సీటు సాధించి ఎంబీబీఎస్ చదువుతోంది. రెండో కుమార్తె తేజశ్విని 2024 నీట్ పరీక్షలో ప్రతిభ చూపి మంచిర్యాల మెడికల్ కళాశాలలో సీటు సాధించింది.

నిండుకుండలా చెరువులు, కుంటలు



నీటితో కళకళలాడుతున్న జాజిరెడ్డిగూడెంలోని తీగలచెరువు



అడివెంల శివారులోని రంగారెడ్డి చెరువు

- యాసంగిలో ఆయకట్టు రైతులకు అందనున్న సాగునీరు
- వర్షాలు, గోదావరి జలాలతో కళకళలాడుతున్న నీటి వనరులు

అర్వపల్లి : వానాకాలం సీజన్‌లో వర్షాలకు తోడు 45 రోజులపాటు గోదావరి జలాలు నిరంతరాయంగా రావడంతో చెరువులు, కుంటలు నిండుకుండలా మారాయి. దాదాపు అన్ని చెరువులు, కుంటలు నిండి అలుగు పోస్తున్నాయి. దీంతో వచ్చే యాసంగికి చెరువులు, కుంటల పరిధిలోని ఆయకట్టుకు సాగునీటి సమస్య తీరనుంది. వానాకాలం సీజన్‌లో జాజిరెడ్డిగూడెం మండల వ్యాప్తంగా సుమారు 22 వేల ఎకరాలకు పైగానే పంటలు సాగయ్యాయి. ఇందులో ఎక్కువగా వరి సాగుచేశారు. ప్రస్తుతం చెరువులు, కుంటలు నిండుకుండలా మారడంతో యాసంగిలో పంటలకు ఢోకా ఉండదని ఆయకట్టు పరిధిలోని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



తిమ్మాపురంలోని ఊరచెరువు

పూర్తిగా నిండి..

జాజిరెడ్డిగూడెం మండల వ్యాప్తంగా వంద వరకు చెరువులు, కుంటలు ఉన్నాయి. అయితే ఇవన్నీ వర్షాలతోపాటు గోదావరి జలాలతో పూర్తిగా నిండాయి. ప్రస్తుతం కూడా కొన్ని అలుగు పోస్తున్నాయి. మండల వ్యాప్తంగా చెరువులు, కుంటల కింద సుమారు 5వేల ఎకరాల వరకు ఆయకట్టు ఉంది. అలాగే గోదావరి జలాలపై ఆధారపడి మరో 17వేల ఎకరాల ఆయకట్టు ఉంది. వానాకాలం సీజన్‌లో 45రోజుల పాటు నిరంతరాయంగా గోదావరి జలాలను విడుదల చేయడంతో పంటలు ఎండిపోకుండా బయటపడ్డాయి. వచ్చే యాసంగి సీజన్‌లో కూడా చెరువులు, కుంటల కింద సాగయ్యే ఆయకట్టుకు నీటి సమస్య తీరనుంది. వానాకాలం మాదిరిగానే వచ్చే యాసంగి సీజన్‌లో కూడా గోదావరి జలాలను విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

తీగల చెరువు కింద రెండెకరాల ఆయకట్టు

జాజిరెడ్డిగూడెంలోని తీగల చెరువు కింద రెండెకరాల వ్యవసాయ భూమి ఉంది. ప్రస్తుతం చెరువు నిండి అలుగు పోస్తుండటంతో వచ్చే యాసంగిలో పంటల సాగుకు సాగునీటి సమస్య తీరనుంది. వర్షాలు పడటంతో పాటు గోదావరి జలాలు రావడంతో చాలా కాలానికి చెరువు నిండింది.

\- మాదగాని వెంకన్న, రైతు, జాజిరెడ్డిగూడెం

చెరువులు అలుగుపోస్తున్నాయి

వర్షాలకు తోడు గోదావరి జలాలు రావడంతో మండల వ్యాప్తంగా ఉన్న వందకు పైగా చెరువులు, కుంటలు నిండి కొద్ది రోజులుగా అలుగు పోస్తున్నాయి. దీంతో వచ్చే యాసంగిలో వీటి ఆయకట్టు పరిధిలోని వ్యవసాయ భూములకు సాగునీటి సమస్య తీరనుంది. వ్యవసాయ అధికారుల సూచనల మేరకు పంటలు సాగుచేసుకోవాలి.

\- హరిస్వరూప్, నీటిపారుదలశాఖ ఏఈ

మహాసమ్మేళనం కరపత్రాల ఆవిష్కరణ

నాగారం : హైదరాబాద్‌లోని ఆదిబట్లలో ఈ నెల 3న జరిగే ధర్మ సమాజ్ పార్టీ కార్యకర్తల మహాసమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల కన్వీనర్ చిప్పలపల్లి నాగార్జున మహారాజ్ కోరారు. ఆదివారం మండల కేంద్రంలో ధర్మ సమాజ్ పార్టీ మహాసమ్మేళన కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు ఏళ్ల తరబడి ఎస్సీ, ఎస్టీ, బీసీ ప్రజలను దోచుకున్నాయని, వారికి కనీసం విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇళ్లు లేకుండా చేశాయని విమర్శించారు. బలహీన వర్గాల రాజ్యాధికారం కోసం డాక్టర్ విశారదన్ మహారాజ్ ఆధ్వర్యంలో ధర్మ సమాజ్ పార్టీ ఏర్పడిందన్నారు. నవంబర్ 3న జరిగే ధర్మ సమాజ్ పార్టీ మహాసమ్మేళనానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ జిల్లా కోశాధికారి గైగుల్లా నిరంజన్, పేరాల శ్రీనివాస్, పృథ్వీ, పేరాల పెద్ద శ్రీనివాస్, వినయ్, ఉపేందర్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ నాయకులు

భవన నిర్మాణానికి భూమి కేటాయించాలి

తుంగతుర్తి : గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో మంజూరైన సంత్ సేవాలాల్ మహారాజ్ భవనానికి ప్రభుత్వం భూమి కేటాయించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని మెయిన్ రోడ్డుపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్, గిరిజన నాయకులు నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. గతంలో ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ ప్రతిపాదనలతో గిరిజన భవన నిర్మాణానికి రూ.2 కోట్ల 50 లక్షలు కేటాయించడంతోపాటు టెండర్ ప్రక్రియ పూర్తిచేసినట్లు తెలిపారు. కానీ నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం స్థల నిర్ధారణ చేయకపోవడం వల్ల పది నెలలుగా నిర్మాణ పనులు ప్రారంభం కాలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకొని రెవెన్యూ అధికారులకు ఆదేశాలు ఇచ్చి ప్రభుత్వ భూమిని కేటాయించాలని కోరారు. వెంటనే భవన నిర్మాణ పనులు చేపట్టే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గుండగాని రాములుగౌడ్, మట్టపల్లి వెంకట్, లాకావత్ యాకునాయక్, గుగులోతు వెంకన్న, గుగులోతు ఈరోజి, నరేష్, పుణ్యానాయక్, శంకర్, గాజుల యాదగిరి, సాయికిరణ్, మల్లేష్, గోపగాని వెంకన్న, రవి, భగవాన్ నాయక్, తడకమళ్ల మల్లికార్జున్, కొండగడుపుల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



తుంగతుర్తిలో నిరసన వ్యక్తం చేస్తున్న గిరిజన, బీఆర్ఎస్ నాయకులు

నూతన విద్యా విధానాన్ని అమలుచేయాలి



అర్వపల్లిలో ర్యాలీలో పాల్గొన్న నాయకులు



తుంగతుర్తిలో..

అర్వపల్లి : రాష్ట్రంలో నూతన విద్యా విధానాన్ని అమలు చేయాలని పీపీఎల్ రాష్ట్ర అధ్యక్షుడు మచ్చ నర్సయ్య ప్రభుత్వాన్ని కోరారు. సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలో ఆదివారం స్వేరో నెట్‌వర్క్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ మహాసభకు గురుకుల తల్లిదండ్రుల కమిటీ ఆధ్వర్యంలో అర్వపల్లి నుంచి ర్యాలీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులకు గురుకులాల్లో నాణ్యమైన భోజనం, విద్య అందించే దిశగా తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్వేరో నెట్‌వర్క్ జిల్లా అధ్యక్షుడు బొల్లికొండ వీరస్వామి, జిల్లా కార్యదర్శి సీహెచ్.లక్ష్మణ్, పీపీఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాతంగి రాములు, దాసరి శ్రీను, కొండగడుపుల యల్లయ్య, బొడ్డు వెంకట్, సునీత, లక్ష్మి, పాండు, శ్రీను, ఉప్పలయ్య, ధనమ్మ, కనకతార, సంధ్య, సుజాత, యాదమ్మ, రత్నకుమారి, నాగమ్మ, జయమ్మ, శైలజ పాల్గొన్నారు.

తుంగతుర్తి : తెలంగాణలో నూతన విద్యా విధానాన్ని ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలో ఆదివారం స్వేరో నెట్వర్క్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ మహాసభకు గురుకుల తల్లిదండ్రుల కమిటీ ఆధ్వర్యంలో పలువురు తరలివెళ్లారు. ఈ సందర్భంగా పీపీఎల్ రాష్ట్ర అధ్యక్షుడు మచ్చ నర్సయ్య మాట్లాడారు. సభకు తరలివెళ్లిన వారిలో స్వేరో నెట్వర్క్ జిల్లా అధ్యక్షుడు బొల్లికొండ వీరస్వామి, మాతంగి రాములు, దాసరి శ్రీను, కొండగడుపుల ఎల్లయ్య, సునీత, లక్ష్మి, పాండు, శ్రీను, ఉప్పలయ్య, ధనమ్మ, సునీత, కనకతార, సంధ్య, సుజాత, యాదమ్మ, రత్నకుమారి, నాగమ్మ, జంపయ్య, శైలజ ఉన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం అందజేత

నాగారం : మండల కేంద్రానికి చెందిన వద్దిగళ్ల మహేష్ ఇటీవల మృతి చెందాడు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు కడియం పరమేశ్వర్ ఆదివారం మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.5,000 ఆర్థికసాయం అందజేశారు. గ్రామానికి చెందిన దగ్గుల మల్లయ్య ఆదివారం అనారోగ్యంతో మరణించడంతో మృతుడి భౌతికకాయాన్ని సందర్శించి, మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.5,000 ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కన్నెబోయిన వెంకటభిక్షం, మంగదుడ్ల దశరథ, జాజుల వీరయ్య, చిప్పలపల్లి మల్లూర్, మహేష్, మల్లేపాక సోమయ్య, పాల్వాయి మల్లయ్య, నాగరాజు, పరశురాములు, బాబు, శ్రీకాంత్, శ్యాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న కడియం పరమేశ్వర్

వరికోత యంత్రాల వైపు.. అన్నదాతల చూపు

- కూలీల కొరతను అధిగమించేందుకు ప్రత్యామ్నాయం

చివ్వెంల : మండలంలో కూలీల కొరత నెలకొన్న తరుణంలో అన్నదాతలు వరికోత యంత్రాల వైపు మొగ్గు చూపుతున్నారు. బి.చందుపట్ల, తిమ్మాపురం, గుంజలూరు, తిరుమలగిరి, వట్టిఖమ్మంపహాడ్, లక్ష్మణ్ నాయక్‌తండా, మున్యానాయక్ తండా, పాండ్యా నాయక్ తండా, బద్యాతండా, ఐలాపురం, గాయంవారి గూడెం గ్రామాల్లో కూలీల కొరతతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న రైతులకు ఇప్పుడు యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. వరికోత యంత్రాలు కూలీలకు ప్రత్యామ్నాయంగా ఉపయోగపడుతున్నాయని రైతులు చెబుతున్నారు. ఖర్చు కాస్త ఎక్కువైనా పనులు వేగంగా, సులభంగా అవుతున్నాయని చెబుతున్నారు. గతంలో వరికోత యంత్రాలు ఎక్కడో ఒక దగ్గర కనిపించేవి. ప్రస్తుతం ప్రతి గ్రామంలోనూ రైతులు ఈ యంత్రాల ద్వారానే పనులు చేయిస్తున్నారు. ప్రతి రోజూ వందల ఎకరాల్లో వరి కోతలు కోయిస్తున్నారు. వరికోత యంత్రాల యజమానులు గంటకు రూ.2500 నుంచి రూ.3500 వరకు తీసుకుంటున్నారు. రైతులకు బ్యాంకు రుణాలు ఇస్తుండటంతో చాలామంది రైతులు హార్వెస్టర్ తెచ్చుకొని ఉపాధి పొందుతున్నారు. గతంలో రైతులు వరికోయడం, బంతి చేయడం, తూర్పార పట్టడం వంటి పనులు చేస్తూ ఐదు నుంచి ఆరు రోజులు సమయాన్ని వెచ్చించే వారు. ప్రస్తుతం యంత్రాలు రావడంతో ఒకే రోజు ధాన్యం ఇంటికి చేరుతోంది.



వాల్యతండాలో వరికోస్తున్న యంత్రం

పని సులువు అవుతుంది

కూలీలు దొరకడం లేదు. అందుకే వరికోత యంత్రాల వైపు మొగ్గు చూపుతున్నాం. ఖర్చు ఎక్కువైనా పనులు సులభం అవుతున్నాయి. ధాన్యం నేరుగా కొనుగోలు కేంద్రాలకు తరలించి అమ్ముకోవచ్చు.

\- ధరావత్ క్రిష్ణ, బద్యాతండా

కూలీల కొరతకు చెక్

వరి కోత యంత్రాల రాకతో పని సులువై కూలీల కొరత తీరినట్లు అనిపిస్తుంది. పశుగ్రాసం మాత్రం నష్టపోతున్నాం. భవిష్యత్‌లో మొత్తం యంత్రాల వినియోగంపైనే రైతులు ఆధార పడే పరిస్థితులు ఉన్నాయి.

\- బానోతు మంగులాల్ నాయక్, మున్యానాయక్ తండా

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

నూతనకల్: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాలేరు వాగు నుంచి ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. తాళ్లసింగారం గ్రామ శివారు గుండా ప్రవహించే పాలేరు వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

అప్రమత్తంగా ఉండాలి

నడిగూడెం : సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ జి.అజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం సిరిపురంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆన్‌లైన్ వ్యాపారాలు చేసి, మోసపోవద్దని, గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఓటీపీ అడిగితే చెప్పొద్దని సూచించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకా ప్రక్రియ వేగవంతం

- గాలికుంటు వ్యాధి నివారణకు ప్రభుత్వం చర్యలు
- గ్రామాల్లో ప్రత్యేక బృందాలతో పశు వైద్యశిబిరాలు

పెన్‌పహాడ్ : ముందస్తుగా పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మండలంలో మొత్తం పశువులు, గేదెలు 6933 ఉండగా ఇప్పటివరకు 350 పశువులకు, 1350 గేదెలకు టీకాలు వేశారు. ఎక్కువగా తెల్లజాతి ఆవులు, ఎద్దులకి ఈ వ్యాధి సోకే అవకాశాలు ఉంటాయని వైద్య నిపుణులు గుర్తించారు. వ్యాధి రాకముందే పశు సంవర్ధక శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. ఇందుకు గాను గ్రామాల్లో ముందస్తు చర్యల్లో భాగంగా పశువులకు టీకాలు వేసే కార్యక్రమం ముమ్మరం చేశారు. టీకాలు వేసిన ప్రతి పశువు చెవికి ట్యాగ్ వేస్తున్నారు. ట్యాగ్ వేసిన పశువుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. మండలంలో పశువైద్య సిబ్బంది రెండు టీంలుగా ఏర్పడి గ్రామాలకు వెళ్లి టీకాలు వేసే పనిలో నిమగ్నమయ్యారు.

టీకాతో పశువులకు రక్షణ..

గాలికుంటు వ్యాధి సోకిన పశువులకు టీకాలు వేయించడంతో వాటిని కాపాడిన వారమవుతాం. గాలికుంటు వ్యాధి సోకిన పశువుల్లో తీవ్ర జ్వరం, గిట్టల మధ్య పగుళ్లు, నోటిలో పుండ్లు కావడం, నీరసించిపోవడం, పాల దిగుబడి తగ్గిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. వ్యాధి సోకిన పశువుల్లో దాదాపు ఐదు శాతం వరకు చనిపోతుండటంతో రైతులు నష్టపోతున్నారు. అందుకే ప్రభుత్వం ఏటా రెండుసార్లు ఉచితంగా టీకాల పంపిణీని చేపడుతోంది. అదే బయట ప్రైవేటుగా ఈ టీకాలు వేయించాలంటే ఎక్కువగా డబ్బు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్ధక శాఖ అధికారులు రైతులకు సూచిస్తున్నారు.



లింగాలలో గేదెలకు గాలికుంటు నివారణ టీకాలు వేస్తున్న పశు వైద్యసిబ్బంది (ఫైల్)

సద్వినియోగం చేసుకోవాలి



రైతులందరూ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి. నవంబర్ 14 వరకు టీకాలు వేసే గడువు ఉంది. రెండు టీమ్‌లను ఏర్పాటు చేసి పశువులకు టీకాలు వేయిస్తున్నాం. ఈ అవకాశాన్ని రైతులు ఉపయోగించుకోవాలి.

\- అనంతుల వెంకన్న, మండల పశువైద్యాధికారి

మానాయికుంట సభకు తరలిన నాయకులు



అర్వపల్లిలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు



తిరుమలగిరి : మానాయికుంటకు వెళ్తున్న కాంగ్రెస్ నాయకులు

అర్వపల్లి : మూసీనది పునరుజ్జీవానికి మద్దతుగా రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ప్రభుత్వానికి సహకరించాలని యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుడిపల్లి మధుకర్‌రెడ్డి, జాజిరెడ్డిగూడెం ఉమ్మడి మండల పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్ రెడ్డి కోరారు. మూసీ ప్రక్షాళనకు మద్దతు తెలుపుతూ ఆదివారం అర్వపల్లిలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానాయికుంట సభకు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో నాయకులు దాసరి సోమయ్య, నర్సింగ వెంకటేశ్వర్లుగౌడ్, బైరబోయిన మహరాజు, సైదులు, నిద్ర సంపత్, బద్దం యాదగిరి, ఎ. వెంకటస్వామి, రవీందర్‌నాయక్, ఎడ్ల సైదులు, జాల నర్సయ్య, దిర్శనపు కృష్ణమూర్తి, సురేందర్, సురేష్, కుంకుడుపాల రవీందర్, కిరణ్, జలేందర్, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి : అడ్డగూడూరు మండలంలోని మానాయికుంట గ్రామంలో ఆదివారం జరిగిన మూసీ పరీవాహక రైతుల ఆత్మీయ సమ్మేళనం సభకు తిరుమలగిరి మండలం నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ శాగంటి అనసూయరాములు, వంగూరి అవిలయ్య, కడమంచి శ్రీను, కన్నెబోయిన లింగయ్య, దేశగాని నర్సయ్య, వంగూరి లింగయ్య, గొడిశాల మల్లయ్య, పత్తి మల్లయ్య, వజ్జ రాజమల్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నాగారంబంగ్లా నుంచి వెళ్తున్న నాయకులు

నాగారం : మూసీ ప్రక్షాళనకు మద్దతుగా అడ్డగూడూరు మండలం మానాయికుంట మూసీ బ్రిడ్జి వద్ద ఆదివారం ఎమ్మెల్యే సామేల్ ఆధ్వర్యంలో నిర్వహించే నియోజకవర్గ స్థాయి మూసీ పరీవాహక రైతుల ఆత్మీయ సమ్మేళనానికి మండలం నుంచి కాంగ్రెస్ నాయకులు భారీగా తరలివెళ్లారు. తరలివెళ్లిన వారిలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల బుచ్చిబాబు, మండల అధ్యక్షుడు తొడుసు లింగయ్య, కడియం పరమేశ్వర్, కన్నెబోయిన వెంకటభిక్షం, జాజుల వీరయ్య, ఎల్మకంటి సోమన్న, మంగదుడ్ల దశరథ, గుంటకండ్ల ముకుందారెడ్డి, మాజీ సర్పంచ్ కన్నెబోయిన రాంమూర్తి, కొనిరెడ్డి మోహన్ రెడ్డి, బయ్యం వెంకన్న, ఎస్‌కే.వలీ, యాకుబ్, అక్బర్, పాషా, ఫరీద్, గుడ్డేటి సురేష్, కొనిరెడ్డి లింగారెడ్డి, పులగం సంజీవరెడ్డి తదితరులు ఉన్నారు.

నూతనకల్ : మూసీ ప్రక్షాళనలో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం మానాయికుంటలో ఎమ్మెల్యే సామేల్ ఆధ్వర్యంలో నిర్వహించిన సభకు మండల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి ఆదివారం భారీగా తరలివెళ్లారు. తరలివెళ్లిన వారిలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నాగం జయసుధ, భూరెడ్డి సంజీవరెడ్డి, ఎలిమినేటి కృష్ణప్రశాంత్, మద్రు ప్రసాద్‌రావు, చురుకంటి చంద్రారెడ్డి, పసుల అశోక్, సురుగు రామచంద్రు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కోదాడరూరల్ : పట్టణంలోని వివేకానంద పాఠశాలలో 1998-99 విద్యా సంవత్సరంలో 10వతరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం స్థానికంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో చిన్ననాటి స్నేహితులందరు పాల్గొని ఒకరినికరు యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సయ్యద్‌బాబా, శివ, రాము, అనిల్, విష్ణు, శైలజ, దివ్య, లావణ్య, పద్మ, కావ్యకుమారి పాల్గొన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

కోదాడరూరల్ : ఎమ్మార్పీఎస్ వర్గీకరణపై కమిటీల పేరుతో కాలయాపన చేయకుండా మాదిగలకు ఇచ్చిన మాటను సీఎం రేవంత్‌రెడ్డి నిలబెట్టుకోవాలని ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు యాతాకుల రాజన్నమాదిగ, చింతా విజయ్‌బాబుమాదిగ అన్నారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నియోజకవర్గ స్థాయి సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. సుప్రీం కోర్టులో ఎస్సీ వర్గీకరణపై సానుకూల తీర్పురాగానే సీఎం రేవంత్‌రెడ్డి దేశంలోనే మొదటగా తెలంగాణలో వర్గీకరణ చేపడతామని మాట ఇచ్చారని గుర్తుచేశారు. నల్లగొండలో జరిగే మాదిగ ధర్మ యుద్ధ ఉమ్మడి జిల్లా సదస్సును విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపూరి రాజుమాదిగ, బొజ్జ సైదులుమాదిగ, వడ్డేపల్లి కోటేష్‌మాదిగ, కొత్తపల్లి అంజయ్యమాదిగ, సిద్దెల శ్రీను మాదిగ, ఏపూరి సత్యరాజుమాదిగ, బొడ్డు కుటుంబరావుమాదిగ పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన

మునగాల : మాధవరం గ్రామంలో ఆదివారం శ్రీశ్రీ నాంచారమ్మ తల్లి, శ్రీపోతురాజుల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఏకలవ్య సంఘం కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో గ్రామానికి చెందిన మేడ్చల్ ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి-కవిత దంపతులు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గ్రామంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కుంభం భిక్షం, కుంభం వీరకర్ణ, కుంభం గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే చర్యలు



ఆటోడ్రైవర్‌కు ఫైన్ విధిస్తున్న ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్

మునగాల : ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ బి.ప్రవీణ్‌కుమార్ హెచ్చరించారు. ఆదివారం మండలంలోని బరాఖత్‌గూడెం గ్రామపంచాయతీ పరిధిలోని శ్రీనివాసనగర్ కాలనీ వద్ద ఆటోలను తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా పరిమితికి మించి ఆటోలలో ప్రయాణికులను తరలిస్తున్న తొమ్మిది ఆటోలపై చలానాలు విధించారు. అనంతరం ఎస్‌ఐ మాట్లాడారు. ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. అనేకమంది మృత్యువాత పడుతున్నారని, తీవ్రంగా గాయాలపాలవుతున్నారని అన్నారు. నలుగురితో వెళ్లాల్సిన ఆటోలో 20మంది ప్రయాణికులను డ్రైవర్లు తరలిస్తున్నారని అన్నారు. ఆటోడ్రైవర్లు విధిగా ఆటోలకు సంబంధించిన అన్ని పత్రాలు కలిగి ఉండాలన్నారు. రానున్న దీపావళి పండుగ సందర్భంగా అనుమతి లేకుండా టపాసులు విక్రయించరాదని, పోలీసు శాఖ అనుమతి తప్పనిసరిగా ఉండాలని ఆయన సూచించారు.